నగరం.. రహదారులు ఘనం

- యుద్ధప్రాతిపదికన రహదారుల విస్తరణ పనులు
- బళ్లారి చౌరస్తా వద్ద 120 అడుగుల రోడ్డు వెడల్పు
- రూ.కోటి వెచ్చించి 350 మీటర్ల పొడువునా రహదారి విస్తరణ
- రూ.2 కోట్లతో ఆర్ అండ్ బి ఆఫీసు నుంచి బి.క్యాంపు పోస్టాఫీసు వరకు విస్తరణ పనులు
- ఐటీసీ, వినాయక్ ఘాట్, వాల్‌మార్ట్ వద్ద వెండర్స్ జోన్ ఏర్పాటు
- స్మార్ట్ సీటీ దిశగా చర్యలు : రామలింగేశ్వర్, అడిషనల్ కమిషనర్



సి.క్యాంపు నుంచి బిర్లాగేట్ రోడ్డు విస్తరణ, మధ్యలో డివైడర్లు



వాల్‌మార్ట్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారుల విస్తరణ, డివైడర్ల ఏర్పాటు

కర్నూలు (టౌన్): రెండేళ్లలో కర్నూలు నగర అభివృద్ధిలో ఊహించలేని విధంగా మార్పు వచ్చింది. ఐదేళ్ల క్రితంతో పోల్చుకుంటే నగరం ఎంతో వృద్ధి సాధించింది. చెత్త రహిత నగరంగానే గాకుండా పచ్చదనంతో పాటు రహదారులను విస్తరణ చేపట్టారు. కొత్తగా శానిటేషన్ డివిజన్లు, ఇంటింటి చెత్త సేకరణ, డస్ట్‌బిన్లు అవసరం లేని నగరంగా పాలకవర్గం, మున్సిపల్ అధికారులు తీర్చిదిద్దారు. రోడ్ల విస్తరణతో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కరించడం సర్కిళ్ల ఏర్పాటు, స్మార్ట్ స్ట్రీట్, వెండర్స్ జోన్ వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు.

ముమ్మరంగా విస్తరణ పనులు

మూడేళ్ల క్రితం నగర విస్తీర్ణం 67 చదరపు కిలోమీటర్లు ఉండేది. 2020లో నగర శివారులోని పందిపాడు, లక్ష్మీపురం, పెద్దపాడు వంటి గ్రామాలను కర్నూలు నగరపాలక సంస్థలో విలీనం చేశారు. ఇప్పటికే మామిదాలపాడు, మునగాలపాడు, స్టాంటన్‌పురం గ్రామాలు నగరపాలక పరిధిలో చేర్చారు. దీంతో నగర విస్తీర్ణం 119 చదరపు కిలోమీటర్ల పరిధికి చేరుకుంది. 2021లో నగర పాలకకు ఎన్నికలు జరగడం, అధికార పార్టీ పాలకవర్గం రావడంతో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పట్టణ ప్రణాళిక విభాగం, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. స్థానిక బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కరించే విధంగా గతేడాది 100 అడుగుల రోడ్డును మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా 120 అడుగులు చేశారు. మొత్తం 350 మీటర్ల మేర ఉల్చాల రోడ్డు వరకు రహదారిని విస్తరించారు. అలాగే రాజ్‌విహార్ నుంచి మౌర్య ఇన్ వరకు విస్తరణ చేపట్టారు. స్థానిక రహదారులు భవనాల శాఖ డీఈఈ కార్యాలయం నుంచి ప్రజారోగ్య సాంకేతిక శాఖ, వాతవరణ శాఖ, బి.క్యాంపు పోస్టాఫీస్ వరకు రోడ్డు వెడల్పు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ఇక్కడ 120 అడుగుల మేర రహదారిని విస్తరించారు. నంద్యాల చెక్‌పోస్టు నుంచి సి.క్యాంపు మీదుగా బిర్లా రోడ్డు నుంచి హైవే వరకు ప్రాధాన్యత క్రమంలో రహదారిని విస్తరించారు. స్థానిక ఏ.క్యాంపు సర్కిల్ నుంచి జొహరాపురం కిమ్స్ ఆసుపత్రి వరకు రహదారి విస్తరణ, మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది.

ముఖ్య కూడళ్లలో సర్కిళ్ల ఏర్పాటు

నగరంలో వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారులను విస్తరించారు. పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో స్థానిక బంగారుపేట వద్ద సర్కిల్ ఏర్పాటు చేశారు. బంగారు పేట వద్ద రహదారిని విస్తరించి సర్కిల్ ఏర్పాటు చేశారు. బిర్లాగేట్ వద్ద సర్కిల్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వాల్‌మార్ట్ వద్ద రహదారులను 120 అడుగులు విస్తరించి సర్కిల్, దండి సత్యాగ్రహ విగ్రహం ఏర్పాటు చేశారు. పచ్చని గడ్డి, విద్యుత్ లైట్లతో సుందరీకరణ చేశారు. అక్కడి నుండి సి.క్యాంపు వరకు రహదారిని విస్తరించి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. ముఖ్యమైన ప్రాంతాల్లో రహదారులను విస్తరించడంతో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.

వెండర్స్ జోన్ ఏర్పాటు

ఎక్కడపడితే అక్కడ వీధి వ్యాపారులు, రోడ్ సైడ్ వ్యాపారులతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో గతంలో ఏన్నడూ లేని విధంగా వెండర్స్ జోన్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. స్థానిక కేసీ కెనాల్ వినాయక ఘాట్ ఎదురుగా, వాల్‌మార్ట్ ఎదురుగా, కృష్ణానగర్ ఐటీసీ సమీపంలో వ్యాపారుల కోసం వెండర్స్ జోన్ ఏర్పాటు చేశారు. దీనికి వ్యాపారులు, నగరవాసుల నుంచి మంచి స్పందన వస్తోంది.

నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో కొన్ని..

- రూ.10 లక్షలతో బంగారుపేట వద్ద సర్కిల్
- రూ.25 లక్షలతో బిర్లాగేట్ వద్ద సర్కిల్
- రూ.30 లక్షలతో వాల్‌మార్టు వద్ద సర్కిల్, దండి సత్యాగ్రహ విగ్రహం
- రూ.కోటితో బళ్లారి చౌరస్తా వద్ద 350 మీటర్ల మేర రహదారి విస్తరణ పనులు
- రూ.కోటితో 500 మీటర్ల మేర సి.క్యాంపు నుంచి బిర్లాగేట్ మీదుగా బి.క్యాంపు పోస్టాఫీసు వరకు విస్తరణ
- రూ.2 కోట్లతో 800 మీటర్ల మేర వాల్‌మార్టు వద్ద విస్తరణ, డివైడర్లు, రహదారి విస్తరణ పనులు
- రూ.60 లక్షలతో జొహరాపురం రోడ్డుకు ఇరువైపులా డివైడర్లు, విస్తరణ పనులు



కె.సి.కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన వెండర్స్ జోన్

విస్తరణ పనులు చక్కగా చేశారు



గతంలో జనాభా పెరిగినా రహదారులను విస్తరించలేదు. దీని వల్ల బైక్‌పై వెళ్లాలన్నా ఎన్నో ఇబ్బందులు ఉండేవి. ఇప్పుడు ఎక్కడ చూసినా రహదారులను బాగా విస్తరించారు. ట్రాఫిక్ సమస్య తగ్గింది. ముఖ్య కూడళ్లలో రోడ్లను విస్తరించడం వల్ల ఇబ్బందులు తొలిగాయి. రెండేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు గణనీయంగా మార్పు వచ్చింది.

– పర్ల సూర్యుడు

సర్కిళ్ల వల్ల ఎంతో ఉపయోగం



నగరంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలంటే సర్కిళ్లు విశాలంగా ఉండాలి. ఆ దిశగా చర్యలు చేపట్టడం మంచి నిర్ణయం. ఎక్కడికక్కడ సర్కిళ్లు, సిగ్నల్స్ ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలను అధిగమించవచ్చు. వేగంగా వెళ్లే బైక్‌లు, ఆటోలను నియంత్రించవచ్చు. అలాగే క్రమపద్ధతిలో వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.

– వసంత్‌కుమార్

అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



నగరంలో గత మూడు సంవత్సరాలుగా అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. చేపడుతున్నాం. ముఖ్యంగా నగర పాలకలో రహదారుల విస్తరణ, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, సర్కిళ్ల ఏర్పాటు, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిగ్నల్స్, రోడ్ సైడ్ వ్యాపారుల కోసం ముఖ్యమైన ప్రాంతాల్లో వెండర్స్ జోన్ ఏర్పాటు చేయడం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయి. అలాగే పార్కులను అందంగా తీర్చిదిద్దాం. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నాం. పనులు టెండర్ దశలో ఉన్నాయి.

– రామలింగేశ్వర్, అడిషనల్ కమిషనర్, నగరపాలక సంస్థ

క్లుప్తంగా

వాటర్ ప్లాంట్ల నిర్మాణాలకు స్థలాల ఎంపిక



సి.బెళగల్లో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని ఐదు గ్రామ పంచాయతీలలో మినరల్ వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను అధికారులు ఎంపిక చేశారు. మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, ఇనగండ్ల, చింతమానుపల్లె గ్రామాల్లో వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు కర్నూలు పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) నిధులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనె నాయక్ గ్రామాలలో పర్యటించారు. సర్పంచ్‌లతో కలిసి స్థలాలను గుర్తించారు. ఒక్క గ్రామానికి రూ.8 లక్షల చొప్పున నిధులను కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి మంజూరు చేయించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు దస్తగిరి, పాండురంగన్న, ఇమ్మానియేల్, రోజా తదితరులు కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ సీబీ తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిస్తున్న హేమలత

కోడుమూరు రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత సూచించారు. బుధవారం కోడుమూరులోని గ్రామ సచివాలయం-2లో జరుగుతున్న కుటుంబ వైద్యవిధానాన్ని హేమలత పరిశీలించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ గర్భందాల్చినప్పటి నుంచి గర్భిణులు రక్తహీనత ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తహీనత మూలంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని, ఎండు ద్రాక్ష, పాలు, గుడ్లు, పండ్లు, వేరుశనగ కలిపి బెల్లం, ఆకు కూరలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా డాక్టర్ల సూచనలతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుమలత, ఆరోగ్య కకార్యకర్త సుబ్బలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత హుసేనాపురం



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ పెద్దల సహకారంతో నిర్వహించిన పోటీలలో హుసేనాపురం జట్టు విజేతగా నిలవగా దాతలు ఆకుల మహేష్, ఉప్పు హనుమంతు రూ.20,016 నగదు బహుమతి అందజేశారు. అలాగే రెండో స్థానంలో నిలిచిన యంబాయి జట్టుకు అడపాల సురేష్ రూ.10,016, మూడో స్థానంలో నిలిచిన గోరుమానుకొండ జట్టుకు వీరభద్రుడు రూ.5,016, నాల్గవ స్థానంలో నిలిచిన ఉప్పలపాడు జట్టుకు ఆకుల వెంకటరాముడు రూ.2016 చొప్పున బహుమతులు అందజేశారు.

అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు



లారీ డ్రైవర్లకు సూచనలు చేస్తున్న అధికారులు

పాణ్యం: అతివేగంతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని కర్నూలు-కడప నేషనల్ హైవే ప్రాజెక్టు హెడ్ మదన్‌మోహన్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆయన బుధవారం పాణ్యం మండల పరిధిలోని పలు ధాబాల వద్ద లారీ డ్రైవర్లకు హైవే పోలీసుల సమన్వయంతో అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి అధిక లోడ్‌తో వచ్చే లారీల డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. నిర్ధిత వేగంతో వాహనం నడపాలని, వాహనం నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. అలాగే లారీ డ్రైవర్లు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడా హైవే నిబంధనలు ఉల్లంఘించరాదని సూచించారు. అనంతరం ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తికి అత్యవసర సమయంలో అందించాల్సిన సేవల గురించి తెలియజేశారు. హైవేలపై సూచిక బోర్డుల గురించి వివరించారు. హైవే ప్రాజెక్టు నిర్వహణ హెడ్ గౌరినాయుడు, రూట్ ఆఫీసర్ కొండా రంజిత్ రెడ్డి, అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న యువనేత కాటసాని శివనరసింహా రెడ్డి

గడివేముల: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా కష్టపడాలని పార్టీ యువ నాయకుడు కాటసాని శివనరసింహా రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన బుధవారం గడివేములలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జగనన్న పాలనలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించడంతో పాటు టీడీపీ మోసాలను ఎండగట్టాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శివరామిరెడ్డి, నాయకులు దస్తగిరి రెడ్డి, దేశం నాగేశ్వర రెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, ఎంపీటీసీ మహేశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రతాప రెడ్డి, చంద్రమౌళీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబరం.. సంక్రాంతి సంబరం

ఓర్వకల్లు: హిందువుల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన సంక్రాంతి సంబరాలు పల్లెల్లో అంబరాన్ని అంటాయి. సంక్రాంతి వేడుకలలో భాగంగా బుధవారం మండలంలోని కన్నమడకల, కేతవరం గ్రామాలలో సమరసతా సేవా ఫౌండేషన్, సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు ఆయా సంఘాల నాయకులు బహుమతులు పంపిణీ చేశారు. మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు.



కన్నమడకలలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఎఫ్ నాయకులు

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు





పాస్టర్లకు నూతన దుస్తులు పంపిణీ చేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కరపత్రాలను విడుదల చేస్తున్న కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

- కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : పార్టీలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందజేస్తూ పేదల ఆర్థికాభివృద్ధికి సీఎం జగనన్న పాటుపడుతున్నారని గుర్తు చేశారు. కోడుమూరులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.మద్దయ్య, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి దంపతులు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, కర్నూలు, సి.బెళగల్ మండలాలకు చెందిన 140 మంది పాస్టర్లకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోట్ల హర్ష చేతుల మీదుగా వారు పాస్టర్లకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల మూలంగా రాష్ట్ర పరిస్థితి బాగోలేనప్పటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగించారని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేశారని గుర్తు చేశారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, వచ్చే ఎన్నికల్లో క్రైస్తవులంతా జగనన్న పక్షాన నిలిచి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలని కోట్ల పిలుపునిచ్చారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కరపత్రాల విడుదల

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవాడలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్. అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 19న నిర్వహించనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను క్రైస్తవ సంఘం పెద్దలతో కలిసి కోట్ల విడుదల చేశారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలను స్మరించుకుంటూ ప్రభుత్వం 206 అడుగుల ఎత్తైన ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వైభవంగా నిర్వహించే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోట్ల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘ పెద్దలు సజీవరాజు, జేకాంత్, ఆర్.సామేలు, సీనియర్ ఫాస్టర్లు, పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి



పంచాయతీల అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఓఆర్డీ సందీప్



మాట్లాడుతున్న ఎంపీడీఓ దస్తగిరి



మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

కోడుమూరు రూరల్ : గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పాటుపడాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజులశిక్షణా తరగతులను సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఎస్‌లు, సచివాలయ సిబ్బందికి నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పల్లెల్లో తిరిగి ఏయే అభివృద్ధి పనులు చేపట్టాలో నిర్ణయించుకుని గ్రామ సభలో తీర్మానం చేయడంతో పాటు, నిర్ణయించిన పనులన్నింటిని ఈ-గ్రామ స్వరాజ్ యాప్ అప్‌లోడ్ చేయాలన్నారు. ఈఓఆర్డీ మంజుల మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు అవసరమైన ఆర్థిక వనరులను అన్వేషించడంతో పాటు, మంజూరైన నిధులను ఏయే పనులకు ఎంత నిష్పత్తిలో ఖర్చు పెట్టాలో ముందుగా నిర్ణయించుకోవాలని సూచించారు. అంతకుముందు శిక్షకులు సంజీవరావు, సుధాకర్, వెంకటేశ్వర్లు గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ గంగరాజు, ఏపీఓ మోదిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

సి.బెళగల్: ప్రణాళికలను రూపొందించి వాటిని అమలు పరచడంతోనే గ్రామాలలో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. బుధవారం ఆయన మండల అధికారులతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల (జీపీడీపీ) పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఎంపీటీసీ సభ్యులకు సమావేశ నిర్వహణ, ఆదాయ వనరుల సృష్టి, పన్నుల వసూళ్లపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి, ఉపాధి ఏపీఓ లక్ష్మన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్, కొత్తకోట, సి.బెళగల్ సర్పంచ్‌లు శ్రీనివాసులు, పాండురంగన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

పాణ్యం: 2024–25 సంవత్సరానికి సంబంధించి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)లను రూపొందించాలని ఎంపీడీఓ దస్తగిరి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాయలంలో జీపీడీపీపై సర్పంచ్‌లు, గ్రామాల కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలోని 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ పథకం నిధులు, సొంత నిధులతో పంచాయతీ పరిధిలో ఏఏ అభివృద్ధి పనులు చేయాలనే విషయంపై గ్రామసభలు ఏర్పాటు చేసుకొని ఈ నెలాఖరు నాటికి ప్రణాళికలను అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ ప్రజలకు అవసరమయ్యే పనులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి పనికి సంబంధించి పూర్తి స్థాయిలో తీర్మానాలు చేయాలన్నారు. గ్రామసభలపై ముందుగానే ప్రజలకు తెలియజేసి వార్డు సభ్యులు, ప్రజల సలహాలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల సమర్పణలో ఏ మాత్రం ఆలస్యం చేయరాదని సూచించారు. అంతేగాక గ్రామ పంచాయతీ పరిధిలో వనరులపై అధ్యయనం చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం అప్‌లోడ్ చేయాలన్నారు. వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ సులోచన, ఈఓ బాలాంజనేయులు పాల్గొన్నారు.

ప్రణాళికల ద్వారానే గ్రామాల అభివృది

గూడూరు: ప్రణాళికల గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ సునీత అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశహాల్‌లో ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రజాప్రతి నిధులు, అధికారులకు గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికల అంశంపై రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రణాళికలు ఎలా తయారు చేయాలని అంశంపై రీసోర్స్ పర్సన్స్ అవగాహన కల్పిస్తారన్నారు. ఎంపీడీఓ, ఈఓఆర్డీ, సూపరింటెండ్ంట్ విజయసింభా రెడ్డి, టెక్నికల్ పర్సన్ రాధిక, పంచాయతీ కార్యదర్శులు చంద్రకళ, తిరుమలేష్ లు రీసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలి

కల్లూరు: గ్రామ పంచాయతీలు, బ్లాక్ (మండల పరిషత్)ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపీడీఓ రమణమూర్తి, ఈఓఆర్డీ రవికిషోర్ సూచించారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బందికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీ వారీగా గ్రామ సభలు ఏర్పాటు చేసుకుని ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించారు. 9 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో కనీసం ఒకటి ఏర్పాటు చేసుకుని అందుకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఓఆర్డీ రవికిషోర్

సంక్షేమ పథకాలు అభివృద్ధి కాదా?



మాట్లాడుతున్న గ్రామ నాయకులు మహేశ్వర రెడ్డి

ఓర్వకల్లు: ప్రజాదరణ కలిగిన నాయకులకే జనం అండగా నిలుస్తారని, కుల రాజకీయాలను గురించి మాట్లాడడం సభ్యత, సంస్కారం కాదని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు హితవుపలికారు. ఈ మేరకు బుధవారం పూడిచెర్ల ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి రాజన్న చేసిన నిరాధార ఆరోపణలను ఖండించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారన్నారు. గ్రామంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని రాజన్న చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. గత నాలుగేళ్ల పాలనలో గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.2.50 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, అనవసరంగా ప్రభుత్వంపై అబాండాలు మోపడం పద్ధతి కాదన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో మేలు జరిగిందన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలో 320 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారని గుర్తుచేశారు. అలాగే గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని చొరవతో బోర్లు వేయించి ప్రజల తాగునీటి కష్టాలు తీర్చామన్నారు. నిత్యం బురదమయంగా ఉండే బజార్లలో సీసీ రోడ్లు వేయించామని తెలిపారు. ఎంపీపీ నిధులు రూ.11 లక్షలు ఖర్చుచేసి పైపులైన్ నిర్మించిన విషయం మరచిపోయారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, ఇష్టం లేకపోతే రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీల వారికి ప్రభుత్వం చేసిన అభివృద్ధి కనిపించదా అని ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వర రెడ్డి, సోమశేఖర్‌నాయుడు, ఆదమ్, ఖాదర్‌బాష, హరినాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి, విజయేశ్వరరెడ్డి, రంగారెడ్డి, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

మిరపపంట దగ్ధం

కల్లూరు : కల్లూరు మండలం కొంగనపాడులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మిరపపంటను దగ్ధం చేశారు. గ్రామానికి చెందిన తెలుగు నాగయ్య, తెలుగు శ్రీనివాసులు పొలంలో మిరపకాయలు ఆరబోశారు. ఒక్కొక్కరు ఐదు ఎకరాల చొప్పున మిరపను సాగు చేశారు. వీటిని రాత్రి 8 గంటల ప్రాంతంలో కొందరు వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితులు తెలిపారు. దాదాపు 120 క్వింటాళ్ల మిరప పంట దగ్ధం అయ్యిందని బాధితులు వాపోయారు.

డిగ్రీ పరీక్షల్లో 17 మంది డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 17 మందిని డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు.